తాను కష్టాలలో ఉన్నప్పుడు
కూడా
నవ్వగలిగే వారు
నాకు ఆదర్శం

తాను ఆపదలో ఉన్నప్పుడు
కూడా
ఇతరులకు సహాయం
చేయగలిగే వారు
నాకు స్ఫూర్తి


వాస్తవాలు పలుకు DD9 **వార్త**

TGTEL/26/A2635

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 28 | 09-06-2026 మంగళవారం | పేజీలు: 06 | వెల: 3/-


'మా బతుకులతో ఆడుకుంటే వదలం'..




# ప్రగతి ప్రస్థానం

మోదీ సంక్షేమ పాలనకు 12 ఏళ్లు
5 శాతానికి పడిపోయిన పేదరికం
పేదలు, అట్టడుగు వర్గాల
జీవితాల్లో వెలుగులు
అపూర్వ 'గరీబ్ కల్యాణ్' ప్రయాణం
'ఎక్స్' వేదికగా ప్రధాని
మోదీ భావోద్వేగ పోస్ట్
గత 12 ఏళ్లలో
సంభవించిన సానుకూల విప్లవం
సంక్షేమ పథకాలే కేంద్రబిందువని వెల్లడి
స్వచ్ఛ భారత్, జల్ జీవన్,
ఆయుష్మాన్ భారత్‌తో ఆత్మగౌరవం
జన్ ధన్ ఖాతాలతో పేదల
ముంగిటకే బ్యాంకింగ్ రంగం
అడ్డంకులు లేని ఆర్థిక విప్లవం
డిజిటల్ టెక్నాలజీతో అవినీతికి చెక్..
లీకేజీలు లేకుండా 'డీబీటీ'
ద్వారా నేరుగా ఖాతాల్లోకే నిధులు
పీఐబీ అధికారిక నివేదికలో వెల్లడి..
26 శాతం నుండి 5 శాతం
లోపు తగ్గిన గ్రామీణ పేదరికం
లక్షలాది కుటుంబాలకు
లభించిన విముక్తి..
'వికసిత్ భారత్' సాకారమే
లక్ష్యంగా సామాజిక ఉద్యమం



హైదరాబాద్, (డిడి9 వార్త):
భారతదేశంలో గత దశాబ్ద కాలానికి పైగా సాగుతున్న పాలన కేవలం ఒక ప్రభుత్వ కాలపరిమితి మాత్రమే కాదు.. ఇది దశాబ్దాలుగా అభివృద్ధి ఫలాలకు, కనీస సౌకర్యాలకు దూరంగా ఉండిపోయిన కోట్లాది మంది అట్టడుగు వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన ఒక అపూర్వ సంక్షేమ ప్రయాణం. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విప్లవాత్మక సంక్షేమ పథకాలు దిగ్విజయంగా అమల్లోకి వచ్చి 12 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ చారిత్రాత్మక మైలురాయిని పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా వచ్చిన సామాజిక, ఆర్థిక మార్పులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా ..మిగతా 2లో

# రేవంత్ మార్క్ సర్కస్

విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం
చేస్తున్న కాంగ్రెస్..
కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం
రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ స్కూళ్లను
4 వేలకు తగ్గించేందుకు కుట్రలు
సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలు
నియంత హిట్లర్, తాలిబాన్ల
పాలనను తలపిస్తున్నాయని విమర్శ
రూ. 11 వేల కోట్ల భారీ ఫీజు
రీయింబర్స్‌మెంట్ బకాయిలను
గాలికొదిలేసిన సర్కార్
డిగ్రీ అడ్మిషన్లలో తీవ్ర
గందరగోళం.. అనుమతి లేని
కోర్సుల్లోనూ యథేచ్ఛగా అడ్మిషన్లు
గురుకులాల్లో వంద మందికి పైగా
విద్యార్థులు చనిపోయినా
సీఎంకు పట్టదా అని ప్రశ్న
పేద విద్యార్థులకు శాపంగా మారిన
జీవో నెం.7.. ప్రైవేట్ కాలేజీల
దోపిడీకి సర్కార్ వత్తాసు
ఫీజు నియంత్రణ చట్టాన్ని
కఠినంగా అమలు
చేయాలంటూ బీఆర్ఎస్
డిమాండ్
రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక
విధానాలపై ప్రజలంతా
ముక్తకంఠంతో పోరాడాలని పిలుపు



హైదరాబాద్, (డిడి9 వార్త):
తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్ల రాష్ట్ర విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి) సీనియర్ నాయకురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా ..మిగతా 2లో

## ఎబోలాపై తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో
నిఘా కట్టుదిట్టం!
ఎబోలాపై దామోదర్
రాజనర్సింహ సమీక్ష
విమానాశ్రయంలో
స్క్రీనింగ్, సర్విలెన్స్‌ను
కట్టుదిట్టం చేసినట్టు వెల్లడి
ఇద్దరు ప్రయాణికులకు ఎబోలా
నెగెటివ్ వచ్చిందన్న మంత్రి

హైదరాబాద్, (డిడి9 వార్త):
ప్రపంచాన్ని టెన్షన్ పెడుతున్న ఎబోలా వైరస్ నియంత్రణపై తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. రాష్ట్ర సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో స్క్రీనింగ్, సర్విలెన్స్‌ను మరింత కట్టుదిట్టం చేసినట్లు ..మిగతా 2లో



# బొగ్గు ఉత్పత్తిలో భారత్ కొత్త రికార్డు..

మోదీ నాయకత్వంలో బొగ్గు రంగానికి కొత్త దిశ
మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు
అవినీతి నుంచి పారదర్శకత వైపు బొగ్గు పరిశ్రమ
12 ఏళ్లలో అభివృద్ధికి బలమైన పునాది
కోల్ రంగంలో నిధుల కొరతకు చెక్
కేంద్ర ప్రభుత్వ సంస్కరణలతో రంగం రూపాంతరం
దేశ ఆర్థికాభివృద్ధికి మైనింగ్ రంగం కీలకం
బొగ్గు ఉత్పత్తి పెంపుతో ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతం
అక్రమాలకు అడ్డుకట్ట వేసిన కేంద్ర విధానాలు
కోల్, గనుల రంగాల్లో పారదర్శక పాలన ఫలితాలు

హైదరాబాద్, (డిడి9 వార్త):
కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా దేశ అభివృద్ధి కోసం అనేక కీలక సంస్కరణలు అమలు చేసిందని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు. గతంలో బొగ్గు రంగం అవినీతి, అక్రమాలు, అరకొర నిధులతో ఇబ్బందులు ఎదుర్కొనేదని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ



# హిట్లర్ వ్యాఖ్యలపై రగడ..

హిట్లర్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్‌కు
శ్రీధర్ బాబు ఘాటు సమాధానం
డిసిప్లేన్‌కు హిట్లర్ పదం వాడకం..
అర్థం వక్రీకరించొద్దన్న మంత్రి
హరీష్, కేటీఆర్ యాత్రలు
అబద్ధాల ప్రచారమేనని విమర్శ
70% హామీలు అమలు చేశాం.. సింగరేణిని
బీఆర్ఎస్ నిర్వీర్యం చేసిందన్న ఆరోపణ

హైదరాబాద్, (డిడి9 వార్త):
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను హిట్లర్ పరిపాలనతో పోలుస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రంగా స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరిస్తూ బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ..మిగతా 2లో



## ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్‌పై రేవంత్ అబద్ధం చెబుతున్నారు

రాజ్యాంగ పదవిలో ఉండి రేవంత్ రెడ్డి
అసత్యాలు చెబుతున్నారని బీజేపీ ఆరోపణ
మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్
అపాయింట్‌మెంట్ కోరారనడం అవాస్తవమని విమర్శ
ఫడ్నవీస్ కార్యాలయం నుంచి
ఎలాంటి అపాయింట్‌మెంట్ కోరలేదని వెల్లడి
కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర,
దక్షిణ భారత రాజకీయాలు చేస్తోందని ఆరోపణ



హైదరాబాద్, (డిడి9 వార్త):
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి కూడా అసత్య ప్రచారాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా ఆరోపించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసేందుకు ప్రయత్నించానని రేవంత్ రెడ్డి చెప్పడం పూర్తిగా అవాస్తవమని ఆయన విమర్శించారు.
హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడుతూ, ..మిగతా 2లో

# కాశీయాత్రలో ఘోర ప్రమాదం

బిహార్‌లో లారీ-బస్సు ముఖాముఖి ఢీ
నెల్లూరు జిల్లా వాసులు ముగ్గురు దుర్మరణం
పుణ్యక్షేత్రాల సందర్శనలో
ఊహించని విషాదం..
సంగం, ఆత్మకూరు ప్రాంతాలకు
చెందిన వారిగా గుర్తింపు
ట్రావెల్ బస్సు ముందుభాగం
పూర్తిగా ధ్వంసం..
మరో 15 మంది
యాత్రికులకు తీవ్ర గాయాలు
క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి అత్యంత
ఆందోళనకరం..
బిహార్ ఆసుపత్రుల్లో ముమ్మర చికిత్స
కన్నీరు మున్నీరవుతున్న
మృతుల కుటుంబ సభ్యులు
రేణిగుంటకు తరలించేందుకు
ప్రభుత్వం సన్నాహాలు
బాధితులకు తక్షణ సాయం
అందించిన హోంమంత్రి అనిత



హైదరాబాద్, (డిడి9 వార్త):
కాశీ, గయ వంటి ఉత్తర భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల దర్శనానికి ఎంతో భక్తిశ్రద్ధలతో వెళ్లిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నివాసితుల బృందంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సు బిహార్ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో నెల్లూరు జిల్లాకు చెందిన ముగ్గురు భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దైవదర్శనాలు చేసుకుని ఎంతో ఆనందంగా, ఆధ్యాత్మిక భావనతో సాగాల్సిన పవిత్ర ప్రయాణం.. ఒక్కసారిగా ఘోర రోడ్డు ప్రమాదంతో శోకసంద్రంగా మారిపోయింది.
నెల్లూరు జిల్లాలోని సంగం, ఆత్మకూరు, దుత్తలూరు మండల కేంద్రాలు మరియు గ్రామ ప్రాంతాలకు చెందిన మొత్తం 43 మంది భక్తులు ఒక బృందంగా ఏర్పడి ఈ నెల 1వ తేదీన ప్రత్యేకంగా ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్సును మాట్లాడుకుని ఉత్తర భారత పుణ్యక్షేత్రాల సందర్శనకు బయలుదేరారు. యాత్రలో భాగంగా పితృదేవతలకు ..మిగతా 2లో

# తెలంగాణను తాకిన నైరుతి రుతుపవనాలు

జోగులాంబ గద్వాల జిల్లా
సరిహద్దుల గుండా ప్రవేశం
రాష్ట్రంలోకి ప్రవేశించిన చల్లని పవనాలు
అరేబియా, బంగాళాఖాతాల్లో
రెండు తుపాను ఆవర్తనాలు
ఈ నెల 10 నుంచి 12 నాటికి
తెలంగాణ అంతటా విస్తారంగా వర్షాలు
ఈ ఏడాది జూన్ 4న ఆలస్యంగా కేరళ
తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు
దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు,
కర్ణాటకలో ఇప్పటికే వంద శాతం విస్తరణ
ఏపీ, మహారాష్ట్ర సరిహద్దుల్లో 30 శాతానికి
పైగా విస్తరించిన వర్షపాత వ్యవస్థ
'ఎల్ నినో' ఎఫెక్ట్: ఈ సీజన్‌లో
దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ
వర్షాలు కురిసే ఛాన్స్
తొలకరి పలకరింపుతో సాగు
పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు



హైదరాబాద్, (డిడి9 వార్త):
గత కొన్ని వారాలుగా రికార్డు స్థాయి తీవ్రమైన ఎండలు, ఉక్కపోత, పొడి వాతావరణంతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు, రాష్ట్ర రైతాంగానికి వాతావరణ శాఖ అత్యంత తీపి కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు తెలంగాణ రాష్ట్రంలోకి అధికారికంగా ప్రవేశించాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమై ..మిగతా 2లో

# బొగ్గు ఉత్పత్తిలో భారత్ కొత్త రికార్డు..

**మొదటిపేజీ తరువాయి**

నాయకత్వంలో ఈ రంగం పూర్తిగా రూపాంతరం చెందిందన్నారు.

కోల్ రంగంలో సంస్కరణల ఫలితంగా దేశవ్యాప్తంగా సుమారు ఐదు లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని కిషన్ రెడ్డి వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో బొగ్గు కేటాయింపుల వ్యవహారంలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయని.. అప్పటి కేంద్ర బొగ్గు మంత్రి జైలుకు వెళ్లిన పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ప్రస్తుతం కోల్ రంగం పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేస్తోందని అన్నారు. ప్రపంచంలో బొగ్గు వినియోగంలో చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందని, దేశ విద్యుత్ ఉత్పత్తిలో 72% బొగ్గుపైనే ఆధారపడి ఉందని మంత్రి వివరించారు. ఈ ఏడాది దేశం ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మైలురాయిని చేరుకుందని తెలిపారు. ప్రస్తుతం దేశ అవసరాలకు సరిపడేలా 80 రోజుల బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయని, విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలగకుండా కోల్ సంస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు.

స్టీల్, ఎరువుల పరిశ్రమలతో పాటు అనేక రంగాలకు బొగ్గు కీలక ముడి పదార్థమని పేర్కొన్న కిషన్ రెడ్డి, గతంలో విదేశాల నుంచి భారీగా బొగ్గు దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు దేశీయ ఉత్పత్తి పెరగడంతో దిగుమతులు గణనీయంగా తగ్గాయని తెలిపారు. మైనింగ్ ప్రాంతాల్లో రైల్వే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ రవాణా ఖర్చులు తగ్గించే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. క్రిటికల్ మినరల్స్ విషయంలో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పోటీ నెలకొందని, వాటి కోసం దేశాధినేతలను కూడా కిడ్నాప్ చేసే స్థాయికి పరిస్థితులు వెళ్లాయని ఆయన వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్‌కు ఒక పొరుగు దేశం కీలక ఖనిజాల సరఫరాను నిలిపివేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో క్రిటికల్ మినరల్స్‌లో స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తోందన్నారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో కూడా కీలక ఖనిజాల సరఫరాపై వివిధ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని చెప్పారు.

కోల్ ఆధారంగా సింథటిక్ గ్యాస్ తయారీపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయంగా ఇరాన్, అమెరికా ఉద్రిక్తతల వంటి పరిస్థితుల వల్ల ఇంధన దిగుమతులపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ వనరుల అభివృద్ధి అవసరమని అన్నారు. దేశంలో 187 బొగ్గు గనులు ఉన్నాయని, వినియోగం పూర్తైన గనులను శాస్త్రీయ పద్ధతుల్లో మూసివేస్తున్నామని మంత్రి తెలిపారు. మూసివేసిన గనుల్లో పెద్ద ఎత్తున వృక్షారోపణ, పర్యాటక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ గనులను ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని, గిన్నిస్ బుక్ రికార్డుకు కూడా ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.

డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (DMF) నిధుల విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. గనుల ప్రభావిత గ్రామాల అభివృద్ధికి 2% నిధులు కేటాయించాలని చట్టం చేసినప్పటికీ, ఆ నిధులను జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆరోపించారు. కలెక్టర్లను అడిగితే కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదనే సమాధానం వస్తోందని చెప్పారు. సింగరేణి కాలరీస్ వ్యవహారాలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని పేర్కొన్న ఆయన, గతంలో డీఎంఎఫ్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. సింగరేణి ఆర్థిక భారం తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని, ఉద్యోగుల కోసం బీమా సదుపాయాలు కూడా తీసుకొచ్చామని తెలిపారు. సింగరేణి ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్‌పై రేవంత్ అబద్ధం చెబుతున్నారు

**మొదటిపేజీ తరువాయి**

ఫడ్నవీస్‌తో భేటీ కోసం రేవంత్ రెడ్డి ఎలాంటి అపాయింట్‌మెంట్ కోరలేదని, ఈ విషయాన్ని ఫడ్నవీస్ కార్యాలయమే స్పష్టం చేసిందని తెలిపారు. నెల రోజుల క్రితం ఒక మంత్రి (ఉత్తమ్) అపాయింట్‌మెంట్ కోరారని, కానీ ఇప్పుడు ముఖ్యమంత్రే స్వయంగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య విభజన రాజకీయాలకు పాల్పడుతోందని రాంచందర్ రావు విమర్శించారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ సాధిస్తున్న పురోగతిని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతోందని ఆయన వ్యాఖ్యానించారు. అభివృద్ధి పథకాలను కాంగ్రెస్ నేతలు స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు.

ఈ సందర్భంగా మూసీ నది ప్రక్షాళన, కాళేశ్వరం ప్రాజెక్టు వంటి అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు వల్ల ప్రభావితమయ్యే బాధితులకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ పోరు తీవ్రతరమైన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# జాకోర, చందూర్ ఎత్తిపోతల పథకాల ప్రారంభానికి సిద్ధం

- **10న రానున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**నిజామాబాద్ జిల్లా (వర్ని), జూన్ 08(డీడీ9 వార్త) :**

వర్ని మండల కేంద్రంలో రూ. 106 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన జాకోర, చందూర్ ఎత్తిపోతల పథకాల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈనెల 10న రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ పథకాలను ప్రారంభించనున్నారు. అదేరోజు సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించనున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెలిప్యాడ్ స్థలం, సభా ప్రాంగణాన్ని సందర్శించి, ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. మంత్రి పర్యటనను విజయవంతం చేసేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్ని, చందూర్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# రేవంత్ మార్క్ 'సర్కస్'

**మొదటిపేజీ తరువాయి**

విడుదల చేసిన ఒక ప్రత్యేక వీడియో సందేశంలో కవిత.. రాష్ట్రంలో విద్యారంగాన్ని రేవంత్ రెడ్డి పూర్తిగా నాశనం చేస్తున్నారంటూ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యబద్ధంగా లేదని, అది హిట్లర్ ఆలోచన విధానాన్ని మరియు తాలిబాన్ల మొండి వైఖరిని తలపిస్తోందని విమర్శించారు.

రాష్ట్రంలో ప్రస్తుతం పేద విద్యార్థులకు అండగా ఉన్న దాదాపు 27 వేల ప్రభుత్వ పాఠశాలలను (గవర్నమెంట్ స్కూల్స్) కేవలం 4 వేలకు తగ్గించాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన తాజా ప్రకటనపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలాది స్కూళ్లను మూసివేయడం లేదా విలీనం చేయడం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులను.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలను చదువుకు పూర్తిగా దూరం చేయాలని రేవంత్ రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. ఒక బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి స్థానంలో ఉండి ఇలా పాఠశాలలను మూసివేస్తామని మాట్లాడటం దుర్మార్గమన్నారు. ఇది తీవ్రమైన నియంతృత్వ ఆలోచనని, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కాంగ్రెస్ నాయకులు ఒక పెద్ద సర్కస్ లాగా మార్చేశారని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో ఉన్నత విద్యారంగం కూడా అధ్వాన్నంగా తయారైందని కవిత ఆరోపించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియలో తీవ్రమైన గందరగోళం నెలకొందని స్పష్టం చేశారు. హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (ఉన్నత విద్యా మండలి) ఒకలా చెబితే.. కాలేజీల కమిషనరేట్ మరోలా ప్రవర్తిస్తోందని, రెండు విభాగాలూ వేర్వేరు కోర్సులను సిఫార్సు చేస్తూ విద్యార్థులను అయోమయంలో పడేస్తున్నాయని విమర్శించారు. యూనివర్సిటీల నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు, గుర్తింపు లేని కోర్సుల్లో కూడా ప్రైవేట్ కాలేజీలు యథేచ్ఛగా అడ్మిషన్లు జరుపుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోవడం వెనుక పెద్ద అవినీతి దాగి ఉందని ఆరోపించారు.

తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నడుస్తున్న ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో (రెసిడెన్షియల్ స్కూల్స్) కనీస వసతులు కరువయ్యాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే రకరకాల కారణాలు, అనారోగ్య సమస్యలు మరియు ఆహార కాలుష్యం (ఫుడ్ పాయిజన్) వల్ల దాదాపు 100 మందికి పైగా విద్యార్థులు గురుకులాల్లో మరణించారని గుర్తు చేశారు. ఇంత పెద్ద సంఖ్యలో దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులు చనిపోతున్నా, విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం ఒక్కటంటే ఒక్క సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవడం అత్యంత దారుణమన్నారు. పేద పిల్లల ప్రాణాలంటే ఈ ప్రభుత్వానికి ఎందుకంత అలుసని ఆమె ప్రశ్నించారు.

పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించిందని కవిత మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ మరియు ఎయిడెడ్ కాలేజీలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 11 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రేవంత్ రెడ్డి సర్కార్ ఉద్దేశపూర్వకంగానే పెండింగ్‌లో పెట్టిందని ధ్వజమెత్తారు. దీనివల్ల కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని, ఫలితంగా వేలాది మంది నిరుపేద విద్యార్థులు చదువు ముగించుకుని కూడా ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన వివాదాస్పద జీవో నెం.7 వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కవిత తెలిపారు. ఈ జీవో ప్రకారం విద్యార్థులు కాలేజీలకు నేరుగా తమ చేతుల్లో నుంచే ట్యూషన్ ఫీజులు చెల్లించాల్సి వస్తోందని.. ప్రభుత్వం ఎప్పుడు డబ్బులు ఇస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఒకవైపు ప్రభుత్వం నుంచి కాలేజీలకు బకాయిలు రాక, మరోవైపు ప్రభుత్వం తెచ్చిన జీవోల సాకుతో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను పీల్చి పిప్పి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద విద్యార్థులను ప్రైవేట్ శక్తుల దోపిడీకి గురిచేసేందుకే కాంగ్రెస్ సర్కార్ ఈ జీవోను తెచ్చిందని ఆరోపించారు.

ప్రైవేట్ విద్యా సంస్థల ఇష్టారాజ్యానికి, మితిమీరిన ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కవిత డిమాండ్ చేశారు. విద్యార్థుల పాలిట శాపంగా మారిన జీవో నెం.7ను వెంటనే రద్దు చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలలో ఫీజులను అదుపులో ఉంచేందుకు గతంలో ప్రతిపాదించిన 'ఫీజు నియంత్రణ చట్టాన్ని' ఎక్కడా రాజీ పడకుండా అత్యంత కఠినంగా అమలు చేయాలని కోరారు. విద్యా వ్యవస్థను కేవలం ఒక వ్యాపారంగా మార్చాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిరుద్యోగులను, విద్యార్థులను వంచిస్తూనే ఉన్నారని కవిత విమర్శించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రైవేట్ శక్తులకు మేలు చేకూర్చేలా సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న విద్యా వ్యతిరేక నిర్ణయాలను రాష్ట్ర ప్రజలంతా, మేధావులు, విద్యార్థి సంఘాలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని ఆమె పిలుపునిచ్చారు. పేదలకు చదువును దూరం చేసే ఎలాంటి చర్యలనైనా తాము సహించబోమని, విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ తరఫున క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు చేస్తామని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

# ప్రగతి ప్రస్థానం

**మొదటిపేజీ తరువాయి**



ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా అత్యంత కీలకమైన సందేశాన్ని పంచుకున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ తన సుదీర్ఘ సందేశంలో.. తమ ప్రభుత్వం సాగించిన 'గరీబ్ కల్యాణ్' (పేదల సంక్షేమం) ప్రయాణం అనేది కేవలం ఒక సాధారణ ప్రభుత్వ సాయం లేదా ఉచిత పథకాల పంపిణీ మాత్రమే కాదని స్పష్టం చేశారు. ఇది ప్రతి పౌరుడిలో మానవ సాధికారతను పెంపొందిస్తూ, భవిష్యత్తులో 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం) లక్ష్యాన్ని సాకారం చేసేందుకు దారితీసే ఒక శక్తివంతమైన సామాజిక ఉద్యమమని ఆయన అభివర్ణించారు. గత 12 ఏళ్ల కాలంలో భారతదేశం ప్రతి రంగంలోనూ ఎన్నో అద్భుతమైన సానుకూల మార్పులను చవిచూసిందని, ఆ విప్లవాత్మక మార్పులన్నింటికీ పేదలు, శ్రామికులు, అట్టడుగు వర్గాల సంక్షేమమే ఏకైక కేంద్రబిందువుగా నిలిచిందని మోదీ సగర్వంగా పేర్కొన్నారు.

దేశంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అంత్యోదయ అన్న యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, పీఎం ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి వినూత్న కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చడంలో అద్భుత విజయం సాధించాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, పక్కా ఇల్లు, స్వచ్ఛమైన తాగునీరు, ఉచిత వైద్య భరోసా కల్పించడం ద్వారా సమాజంలో పేదలకు సమాన అవకాశాలు లభించాయన్నారు. ఈ పథకాలు కేవలం భౌతిక వసతులను మాత్రమే కాకుండా, సమాజంలో పేద వర్గాలకు సమాన గౌరవాన్ని, ఉన్నతమైన ఆత్మగౌరవాన్ని కల్పించాయని ప్రధాని మోదీ తన సందేశంలో భావోద్వేగంగా పంచుకున్నారు.

భారతదేశంలో ఒకప్పుడు బ్యాంకుల చుట్టూ తిరగడం కేవలం ధనవంతులకు మాత్రమే సాధ్యమయ్యే పనిగా ఉండేదని, కానీ తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' ఈ వివక్షకు పూర్తిగా చరమగీతం పాడిందని ప్రధాని గుర్తు చేశారు. కోట్ల సంఖ్యలో జీరో బ్యాలెన్స్ ఖాతాలను తెరవడం ద్వారా బ్యాంకింగ్ రంగాన్ని సామాన్యుడి ముంగిటకు తీసుకువచ్చామన్నారు. ఈ జన్ ధన్ ఖాతాల విప్లవం కారణంగా దేశంలోని ప్రతి పేదవాడికి దేశ ఆర్థిక వ్యవస్థతో బలమైన అనుసంధానం ఏర్పడిందని వివరించారు. లబ్ధిదారులకు అందే ప్రతి పైసా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వారి ఆత్మాభిమానాన్ని పెంపొందించేలా చేయడంలో ఈ ఖాతాలు కీలక పాత్ర పోషించాయని చెప్పారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన వందల కోట్ల రూపాయల ప్రయోజనాలను పేద ప్రజలకు ఎక్కడా అవినీతి లేకుండా నేరుగా, పారదర్శకంగా అందించడంలో ఆధునిక డిజిటల్ సాంకేతికత పోషించిన పాత్రను ప్రధాని మోదీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. సమాచార, కమ్యూనికేషన్ సాంకేతికత వినియోగంతో 2013 జనవరి 1న దేశంలో చిన్నగా ప్రారంభమైన డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానాన్ని తమ ప్రభుత్వం అత్యంత సమర్థవంతంగా దేశంలోని మారుమూల గ్రామాల్లోని క్షేత్రస్థాయికి తీసుకెళ్లిందని గుర్తుచేశారు. పూర్వం పథకాల నిధులను మింగేసే మధ్యవర్తుల దోపిడీని, అక్రమాలను డిజిటల్ టెక్నాలజీతో అడ్డుకున్నామని స్పష్టం చేశారు.

గతంలో ప్రభుత్వ నిధులు లబ్ధిదారులకు చేరే సరికి సగానికి పైగా మాయమైపోయే పరిస్థితులు ఉండేవని, కానీ నేడు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు లేదా పోస్టల్ ఖాతాల్లోకే వంద శాతం నిధులు సురక్షితంగా జమ అవుతున్నాయని ప్రధాని మోదీ వివరించారు. వ్యవస్థలోని లీకేజీలను, అక్రమాలను పూర్తిగా నిర్మూలించడం ద్వారా ప్రభుత్వ పాలనపై సామాన్య ప్రజల్లో నమ్మకం మరియు విశ్వాసం రెట్టింపు అయ్యాయని చెప్పారు. నిజాయితీతో కూడిన డిజిటల్ పాలన వల్ల ప్రభుత్వ ఖజానాకు చెందిన వేల కోట్లు ఆదా అవ్వడమే కాకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతోందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఇటీవల వెల్లడించిన అధికారిక గణాంకాలు భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో, పేదల జీవన ప్రమాణాల్లో వచ్చిన అద్భుతమైన మార్పును సజీవంగా స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ నివేదికల ప్రకారం.. 2012 నాటి వాతావరణంలో దేశంలో సుమారు 26 శాతంగా నమోదైన భయంకరమైన గ్రామీణ పేదరికం.. గడిచిన 12 ఏళ్ల నిరంతర సంక్షేమ పథకాల పుణ్యమా అని, 2024 నాటికి ఏకంగా ఐదు శాతం కంటే తక్కువకు పడిపోయింది. అంతర్జాతీయ వేదికలపై సైతం భారతదేశం సాధించిన ఈ పేదరిక నిర్మూలన విజయం ఒక సరికొత్త రికార్డుగా నిలిచింది.

కేవలం ఒక దశాబ్ద కాలంలోనే దేశంలోని లక్షలాది గ్రామీణ పేద కుటుంబాలు దారిద్ర్య రేఖ మరియు పేదరికపు కోరల నుంచి శాశ్వతంగా విముక్తి పొంది, సమాజంలో గౌరవప్రదమైన, సుఖవంతమైన జీవనాన్ని సాగించడం ఆధునిక భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద సామాజికఆర్థిక పరిణామంగా నిలిచింది. నిర్దేశిత లక్ష్యాలతో, పక్కా ప్రణాళికలతో సాగిన మోదీ ప్రభుత్వ సంక్షేమ ప్రయాణం నేడు గ్రామాలు, నగరాల మధ్య ఉన్న వ్యత్యాసాలను, అంతరాళాలను పూర్తిగా చెరిపేస్తోంది. ఈ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ సమానంగా అందుతుండటంతో, భారతదేశం ప్రగతి పథంలో అత్యంత వేగంగా పరుగులు పెడుతోందని, ఈ ప్రయాణం ఇలాగే నిరంతరం కొనసాగుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఎబోలాపై తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం

**మొదటిపేజీ తరువాయి**

ఆయన వెల్లడించారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై విమానాశ్రయం నుంచే 21 రోజుల పాటు కఠిన పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

విదేశీ ప్రయాణికులతో కమ్యూనికేషన్ సులువుగా ఉండేందుకు ఎయిర్‌పోర్ట్‌లో ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి భాషలు తెలిసిన సిబ్బందిని నియమించాలని మంత్రి సూచించారు. కాంటాక్ట్ ట్రేసింగ్ కోసం హెల్త్, పోలీస్, ఎయిర్‌పోర్ట్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తప్పుడు సమాచారం లేదా తప్పుడు అడ్రస్‌లు ఇచ్చే ప్రయాణికులపై ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో నమోదైన ఇద్దరు అనుమానితులకు ఎబోలా నెగెటివ్ వచ్చిందని, అయితే నిర్ధారణ కోసం మరోసారి నమూనాలను పరీక్షకు పంపామని మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితుల కోసం గాంధీ ఆసుపత్రిలో ఐసోలేషన్ వార్డులను సిద్ధం చేశామన్నారు. సీసీఎంబీకి టెస్టింగ్ కిట్లు అందాయని, పరీక్షలు కూడా ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ, ఐసీఎంఆర్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని... కాబట్టి ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

# 'హిట్లర్' వ్యాఖ్యలపై రగడ..

**మొదటిపేజీ తరువాయి**



సైతం స్వయంగా తానే ఒక హిట్లర్‌నని ప్రకటించుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ, అందుకు సంబంధించిన ఒక వీడియోను కూడా మంత్రి ఈ సందర్భంగా ప్రదర్శించారు.

**డిసిప్లేన్ వేరు.. డిక్టేటర్‌షిప్ వేరు..!**

హిట్లర్ అనే పదంపై మంత్రి శ్రీధర్ బాబు ఆసక్తికర వివరణ ఇచ్చారు. గతంలో చిరంజీవి హీరోగా 'హిట్లర్' అనే సినిమా కూడా వచ్చిందని, సమాజంలో క్రమశిక్షణను (డిసిప్లేన్) ఆశించే ఉద్దేశంతో సాధారణ జనబాహుళ్యంలో ఈ పదాన్ని వాడుతుంటారని చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధానికి కారణమైన నాజీ హిట్లర్ వేరు, సాధారణంగా వాడే హిట్లర్ వేరు అని స్పష్టం చేశారు. ఒక బాధ్యతాయుతమైన పదాన్ని డిక్టేటర్‌షిప్ (సర్వాధికార పాలన) అని ప్రచారం చేయడం సరికాదన్నారు. "కేటీఆర్.. మీ నాన్న కేసీఆర్ కూడా నేను హిట్లర్‌ని అన్నప్పుడు మీ సమాధానం ఏంటి?" అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ పాలనలో సెక్రటేరియట్‌కు పదేళ్లపాటు ఇనుప కంచెలు వేసి, ప్రగతి భవన్‌ను నాజీల బంకర్ తరహాలో మార్చారని, అది గాంధీ మార్గమా అని నిలదీశారు. హైదరాబాద్‌లోని చెరువులను కబ్జాల నుండి కాపాడాలనే సీఎం రేవంత్ రెడ్డి దృఢ సంకల్పంలో భాగమే ఈ కఠిన నిర్ణయాలని వెల్లడించారు.

**హరీష్ రావు యాత్రలపై మండిపాటు: అబద్ధాల ప్రచారం**

బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావు ఇద్దరూ పోటాపోటీగా రాజకీయ యాత్రలు చేస్తూ ప్రజల్లోకి అసత్యాలను తీసుకువెళ్తున్నారని శ్రీధర్ బాబు విమర్శించారు. పెద్దపల్లికి వెళ్లిన హరీష్ రావు అక్కడ భూముల ధరలు తగ్గాయని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఎక్కడైనా భూముల ధరలు తగ్గుతాయా అని ప్రశ్నించిన మంత్రి.. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నేతలు ల్యాండ్ మాఫియాతో చేతులు కలిపి కృత్రిమంగా ధరలు పెంచారని, అప్పట్లో సామాన్యుడు గజం భూమి కొనాలన్నా భయపడే పరిస్థితి ఉండేదని ఆరోపించారు. సోషల్ మీడియాను ఆయుధంగా వాడుకుంటూ సత్యదూరమైన విషయాలను నిజాలుగా చిత్రీకరిస్తున్నారని, హరీష్ రావు ఇప్పటికైనా హుందాతనంగా వ్యవహరించాలని హితవు పలికారు.

**రెండేళ్లలోనే 70 శాతం హామీల అమలు**

తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండున్నర ఏళ్లలోనే ఏకంగా 70 శాతం హామీలను నెరవేర్చిందని మంత్రి శ్రీధర్ బాబు గర్వంగా ప్రకటించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తే, ఆ ప్రజాదరణను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు విసిగిపోతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ తామిచ్చిన హామీల్లో సగం కూడా నెరవేర్చలేదని, అలాంటి వారికి తమను విమర్శించే హక్కు లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో 1,200 మంది చనిపోతే కేవలం 400 మందికి మాత్రమే ఆర్థిక సాయం అందించి, మిగిలిన 800 మందిని బీఆర్ఎస్ ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు.

**సింగరేణికి బీఆర్ఎస్ చేసిన ద్రోహం**

సింగరేణి సంస్థను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని శ్రీధర్ బాబు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సింగరేణి సంస్థకు ప్రభుత్వం నుండి రావాల్సిన 40 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించకుండా తొక్కిపెట్టారని ఆరోపించారు. సింగరేణిలో ఉన్న కాంట్రాక్టర్లలో ఎక్కువ మంది బీఆర్ఎస్ నేతల బంధువులేనని, ప్రైవేట్ బొగ్గు డిపోలకు అనుమతులు ఇచ్చింది కూడా వారేనని స్పష్టం చేశారు. అలాగే మెడికల్ బోర్డు వివాదానికి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమన్నారు.

**అధికారులను బెదిరిస్తే ఊరుకోం**

ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై కాదు, బీఆర్ఎస్ అరాచక పాలనపై విసిగిపోయి ఎన్నికల్లో సరైన జవాబు చెప్పారని మంత్రి అన్నారు. మునిగిపోయే కారులో కూర్చున్న బీఆర్ఎస్ నేతలకు వచ్చే ఎన్నికల్లో కనీసం 10 సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తాము అధికారంలోకి వస్తున్నాం.. మీ సంగతి చెప్తాం అంటూ చట్ట ప్రకారం పనిచేసే అధికారులను బెదిరించే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రతిపక్షాల చప్పుళ్లకు భయపడాల్సిన అవసరం లేదని, చట్టానికి లోబడి పనిచేసే అధికారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# కాశీయాత్రలో ఘోర ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

పిండప్రదానాలు చేసేందుకు మొదట బిహార్‌లోని పవిత్ర గయా క్షేత్రాన్ని భక్తులు దర్శించుకున్నారు. అక్కడ పూజా కార్యక్రమాలు ముగించుకుని, తదుపరి పుణ్యక్షేత్రమైన వారణాసి (కాశీ) వైపు బస్సులో రాత్రి వేళ ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో బిహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ జాతీయ రహదారి సమీపంలోకి రాగానే అర్ధరాత్రి సమయంలో ఎదురుగా అతివేగంగా వచ్చిన ఒక భారీ లారీ.. యాత్రికుల బస్సును ముఖాముఖి (నేరుగా) బలంగా ఢీకొట్టింది.

లారీ ఢీకొట్టిన వేగం చాలా ఎక్కువగా ఉండటంతో, ట్రావెల్ బస్సు ముందుభాగం పూర్తిగా నలిగిపోయి లోపలికి దూసుకుపోయింది. ఈ ఘోర ప్రమాదంలో బస్సు ముందు సీట్లలో కూర్చున్న సంగం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన చౌడం హజరతయ్య, సంగం పల్లెకు చెందిన పసుపులేటి వెంకటేశ్వర్లు, ఆత్మకూరు పట్టణానికి చెందిన తూమా పద్మావతి తీవ్ర రక్తస్రావమై బస్సు సీట్లలోనే ప్రాణాలు విడిచారు. బస్సులో నిద్రిస్తున్న మిగిలిన యాత్రికులలో మరో 15 మందికి తీవ్రమైన గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, జాతీయ రహదారి పహారా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సు అద్దాలు పగలగొట్టి బాధితులను బయటకు తీశారు. గాయపడిన వారందరినీ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు.

పుణ్యయాత్రకు వెళ్లిన తమ కుటుంబ సభ్యులు కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు తిరిగి వస్తారని వెయ్యి కళ్లతో ఎదురు చూసిన కుటుంబాలకు ఈ ఘోర వార్త పిడుగుపాటులా తగిలింది. ప్రమాద వార్త తెలిసిన వెంటనే మృతుల ఇళ్ల వద్దకు బంధువులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుల భార్యాపిల్లలు, తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తీరు అక్కడి వారిని కలచివేస్తోంది. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉండటంతో, తమ వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలియక స్వగ్రామాల్లోని బంధువులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

ప్రమాదం జరిగిన బస్సులో ఉన్న మిగిలిన యాత్రికుల పరిస్థితి మరియు పూర్తి వివరాల కోసం నెల్లూరు జిల్లాలోని వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా ఆరా తీస్తున్నారు. బిహార్‌లోని స్థానిక ఆసుపత్రులకు, అలాగే అక్కడ ఉన్న తోటి ప్రయాణికులకు నిరంతరం ఫోన్ కాల్స్ చేస్తూ సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. లక్కీగా ప్రాణాలతో బయటపడిన వారు గాయపడిన వారికి సేవలు అందిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని, ప్రాణాపాయం నుంచి బయటపడి సురక్షితంగా స్వగ్రామాలకు చేరుకోవాలని గ్రామాల్లోని దేవాలయాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు.

ఈ దారుణ రోడ్డు ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తక్షణమే స్పందించారు. ప్రమాదంలో జిల్లా వాసులు ప్రాణాలు కోల్పోవడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బిహార్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు అక్కడి స్థానిక ప్రభుత్వ అధికారులు మరియు వైద్యులతో మాట్లాడి మెరుగైన అత్యవసర వైద్య సహాయం అందేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ఏపీ ప్రభుత్వం అన్ని విధాలా ఆర్థికంగా, సామాజికంగా అండగా ఉంటుందని మంత్రి ఆనం గట్టి హామీ ఇచ్చారు.

నెల్లూరు జిల్లా యాత్రికుల బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆమె బిహార్ రాష్ట్ర ఉన్నత స్థాయి పోలీస్, పరిపాలనా అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రమాద స్థలంలో రెస్క్యూ ఆపరేషన్ వేగంగా జరిగేలా చూడాలని కోరారు. ముఖ్యంగా తీవ్రంగా గాయపడిన ముగ్గురు యాత్రికులకు అత్యవసర ప్రాణరక్షణ వైద్యం అందించేందుకు బిహార్‌లోనే నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదంలో క్షేమంగా బయటపడిన మిగిలిన భక్తులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకున్నారు.

ప్రమాదంలో మరణించిన ముగ్గురు యాత్రికుల పార్థివ దేహాలను ఏపీలోని వారి స్వగ్రామాలకు వీలైనంత వేగంగా తరలించేందుకు హోంమంత్రి అనిత, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బిహార్ ఆసుపత్రుల్లో పోస్టుమార్టం ప్రక్రియ ముగిసిన వెంటనే, మృతదేహాలను ప్రత్యేక విమానం ద్వారా తిరుపతి సమీపంలోని రేణిగుంట విమానాశ్రయానికి తరలించనున్నారు. అక్కడి నుండి ప్రత్యేక అంబులెన్సుల ద్వారా మృతదేహాలను నెల్లూరు జిల్లాలోని సంగం, ఆత్మకూరు, దుత్తలూరు ప్రాంతాలలోని వారి సొంత ఇళ్లకు చేర్చేలా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ ఘోర దుర్ఘటన నెల్లూరు జిల్లావ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని, శోకాన్ని మిగిల్చింది.

# హామీలు అమలు చేయకుంటే ఉద్యమం తప్పదు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 08(డీడీ9 వార్త) :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో మరియు బడ్జెట్ సమావేశాల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, కొత్త పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది లబ్ధిదారులను మోసం చేస్తోందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య తీవ్రంగా విమర్శించారు. బోధన్ పట్టణం రాకాసిపేట్ గ్రామాభివృద్ధి కమ్యూనిటీ హాల్‌లో సోమవారం జరిగిన ఎన్పీఆర్డీ విస్తృత సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా యం. అడివయ్య మాట్లాడుతూ... 2023 డిసెంబర్‌లో జరిగిన 'ప్రజాపాలన' కార్యక్రమంలో సుమారు 24.85 లక్షల మంది చేయూత పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 30 నెలలు గడిచినా వారి సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా 2026 ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల్లో, జూన్ 2న 2 లక్షల మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించిందని, కానీ నేటికీ ఆ హామీ నెరవేరలేదని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రకటన నమ్మి, లక్షలాది మంది లబ్ధిదారులు మీ సేవ కేంద్రాల చుట్టూ తిరిగి సర్టిఫికెట్లు పొంది దరఖాస్తు చేసుకున్నారని, వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని, ఇది సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పెన్షన్ల పంపిణీకి తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో భాగంగా, జూన్ 10న హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గైని రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నజీర్, సహాయ కార్యదర్శి ముంజం సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు గాండ్ల గంగారం, ఆవుల సావిత్రి, శివ ప్రసాద్, బుష్ గంపల సంగప్ప, పటేల్ సాయినాథ్, జెల్లా అంజలి, లింగం ముత్యాలు, రజిత, కరుణ, ఏషాల గంగామణి, ఏషాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణను తాకిన నైరుతి రుతుపవనాలు

**మొదటిపేజీ తరువాయి**

చల్లని గాలులు వీస్తుండటంతో గుక్కతిప్పుకోకుండా చేస్తున్న భానుడి భగభగల నుండి సామాన్య జనానికి పెద్ద ఉపశమనం లభించింది. ఈ రుతుపవనాల రాకతో రాష్ట్రంలో వానాకాలం సీజన్ ప్రారంభమైనట్లయింది.

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన తాజా నివేదికల ప్రకారం.. నైరుతి రుతుపవనాలు సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటక నుండి కదులుతూ తెలంగాణలోని దక్షిణ సరిహద్దు ప్రాంతమైన జోగులాంబ గద్వాల జిల్లా ద్వారా రాష్ట్రంలోకి అడుగుపెట్టాయి. గద్వాల జిల్లాలోని పలు ప్రాంతాలలో ఇప్పటికే ఆకాశం దట్టమైన నల్లటి మేఘాలతో కమ్ముకుని, చల్లని ఈకగాలులతో కూడిన మోస్తరు వర్షాలు ప్రారంభమయ్యాయి. రుతుపవనాల ప్రవేశానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడటంతో, ఇవి వేగంగా ముందుకు సాగుతున్నాయని, రాబోయే కొన్ని గంటల్లోనే పొరుగున ఉన్న మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాలకు సైతం విస్తరించనున్నాయని శాస్త్రవేత్తలు ప్రకటించారు.

ప్రస్తుతం రుతుపవనాల కదలికలు వేగవంతం కావడానికి సముద్రంలో ఏర్పడిన సరికొత్త వాతావరణ మార్పులే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈశాన్య అరేబియా సముద్రంతో పాటు, అటు ఉత్తర బంగాళాఖాతంలో ఒకే సమయంలో రెండు బలమైన తుపాను ఆవర్తనాలు ఏర్పడ్డాయి. ఈ రెండు ఆవర్తనాల ప్రభావం వల్ల రుతుపవనాల కదలికలకు అంతర్జాతీయంగా, స్థానికంగా తీవ్రమైన సానుకూల పరిస్థితులు లభించాయి. ఇవి సముద్రాల నుంచి తేమతో కూడిన మేఘాలను భూభాగం వైపునకు బలంగా నెడుతుండటంతో రుతుపవన ద్రోణి మరింత ఉత్తర దిశగా వేగంగా విస్తరిస్తోంది.

సాధారణంగా ప్రతి ఏడూ జూన్ 1వ తేదీ నాటికే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది మూడు రోజులు ఆలస్యంగా, అంటే జూన్ 4వ తేదీన ఇవి కేరళలో ప్రవేశించాయి. ప్రవేశం కొద్దిగా ఆలస్యమైనప్పటికీ, ఆ తర్వాత ఏర్పడిన వాతావరణ పరిస్థితుల వల్ల ఇవి భారత తీరప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల గుండా అత్యంత వేగంగా ముందుకు సాగాయి. దక్కన్ పీఠభూమిలో ఉన్న తెలంగాణ ప్రాంతం కొద్ది రోజులుగా ఈ రుతుపవనాల రాక కోసం ఎదురుచూడగా, జూన్ 10 నుంచి 12 మధ్యన ఇవి రాష్ట్రవ్యాప్తంగా పూర్తి స్థాయిలో విస్తరిస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుత ప్రయాణంలో నైరుతి రుతుపవనాలు దేశంలోని దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాలలో ఇప్పటికే వంద శాతం పూర్తిగా విస్తరించాయి. బంగాళాఖాతంలో కూడా ఇవి పూర్తిగా విస్తరించి బలంగా మారాయి. మరోవైపు పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ (రాయలసీమ, దక్షిణ కోస్తా ప్రాంతాలు), అలాగే మహారాష్ట్రలోని కొన్ని భాగాలలో దాదాపు 30 శాతం మేర ఈ రుతుపవన వ్యవస్థ విస్తరించింది. ఏపీలో విస్తరించిన ఈ పవనాలే ఇప్పుడు తెలంగాణ సరిహద్దుల్లోకి చొచ్చుకువచ్చి వర్షాలు కురిపిస్తున్నాయి.

రుతుపవనాల ద్రోణి వెంబడి ఏర్పడిన తుపాను ఆవర్తనాల కారణంగా అరేబియా సముద్రం నుంచి వస్తున్న తేమతో కూడిన గాలులు దేశం నడిబొడ్డు వైపు కదులుతున్నాయి. అదే సమయంలో బంగాళాఖాతంలో ఉన్న ఆవర్తనం చుట్టుపక్కల గాలిని తన వైపునకు లాక్కుంటోంది. ఈ రెండింటి కలయిక వల్ల మధ్య భారతదేశంతో పాటు తెలంగాణపై మేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. ఈ వ్యవస్థ జూన్ 11వ తేదీ నాటికి మరింత బలపడనుందని, దీనివల్ల తెలంగాణవ్యాప్తంగా విస్తారంగా మరియు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. ఇప్పటికే రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ముందస్తుగా మోస్తరు జల్లులు కురుస్తున్నాయి.

రుతుపవనాల రాక సంతోషాన్ని కలిగిస్తున్నప్పటికీ, వాతావరణ శాస్త్రవేత్తలు మరో ఆందోళనకరమైన నివేదికను కూడా వెల్లడించారు. ఈ ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన తీవ్రమైన 'ఎల్ నినో' ప్రభావం కారణంగా దేశవ్యాప్తంగా ఈ సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని ఐఎండీ అంచనా వేసింది. దేశ సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మేరకే వానలు కురిసే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాలలో కరువు పరిస్థితులు లేదా పొడి వాతావరణం ఉండవచ్చని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను, భూగర్భ జలాలను ప్రజలు ఎంతో పొదుపుగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఏది ఏమైనప్పటికీ, తెలంగాణలోకి నైరుతి రుతుపవనాల ప్రవేశం ఖరీఫ్ (వానాకాలం) పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఒక పెద్ద ఊరటనిచ్చింది. తొలకరి వానలు పడటంతో అన్నదాతలు తమ పొలాలను దున్నడం, విత్తనాలు కొనుగోలు చేయడం వంటి వ్యవసాయ పనులను ఉత్సాహంగా ప్రారంభించారు. అయితే, ఎల్ నినో ప్రభావం ఉన్నందున రైతులు తొందరపడి తక్కువ వర్షాలకే విత్తనాలు వేయవద్దని, భూమి పూర్తిగా పదును అయిన తర్వాతే సాగు పనులు మొదలుపెట్టాలని వ్యవసాయ అధికారులు సలహా ఇస్తున్నారు. రాబోయే రోజుల్లో వర్షాల తీవ్రతను బట్టి నీటి నిర్వహణపై రైతులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# అడ్మిషన్ తీసుకునే ముందు జాగ్రత్త : ఏఐబీఎస్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 08(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని చైతన్య ఒకేషనల్ కళాశాల యాజమాన్యం తీరుపై ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ విద్యార్థి సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బోధన్ పట్టణంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ... సదరు కళాశాలలో చేరిన విద్యార్థులు యాజమాన్యం వల్ల తీవ్రంగా మోసపోతున్నారని ఆరోపించారు.

అడ్మిషన్ సమయంలో స్కాలర్‌షిప్ వస్తుందని నమ్మబలికి, కాలేజీ ప్రారంభమైన రెండు మూడు నెలల తర్వాత అధిక ఫీజుల పేరుతో, పరీక్షల పేరుతో విద్యార్థులను వేధిస్తున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించని విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా శిక్షణకు పంపకుండా బెదిరిస్తున్నారని, దీనివల్ల ఎంతోమంది విద్యార్థులు మధ్యలోనే చదువుకు దూరమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. కళాశాలలో కనీస వసతులు లేకపోవడం, సరైన సెక్యూరిటీ లేకపోవడం వల్ల ర్యాగింగ్ వంటి సమస్యలు అధికంగా ఉన్నాయని ఆయన మండిపడ్డారు. విద్యార్థులు, తల్లిదండ్రులు మోసపోకుండా ఉండేందుకు ముందస్తుగా అగ్రిమెంట్ చేసుకోవాలని, ఫీజుల వివరాలను స్పష్టంగా రాసిపెట్టుకోవాలని ఆయన సూచించారు. చైతన్య ఒకేషనల్ కళాశాల యాజమాన్యం విద్యార్థులను భయాందోళనలకు గురిచేయడం మానుకోవాలని లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐబీఎస్ నాయకులు రాజన్న, సురేష్, మోహన్, గంగాప్రసాద్, శీను తదితరులు పాల్గొన్నారు.




# పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

**బోధన్‌లో సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో నిరసన**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 08(డీడీ9 వార్త) :**


గ్యాస్ సిలిండర్ ధరలను పదేపదే పెంచుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరుస్తోందని ఆరోపిస్తూ సోమవారం బోధన్ పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఖాళీ గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేస్తూ "పెరిగే ధరలకు హద్దే లేదు ఏలేటోడికి సిగ్గే లేదు, మూడు నెలల్లో రెండుసార్లు ధరలను పెంచడం సిగ్గుచేటు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ధరలు పెంచబోమని హామీ ఇచ్చి, ప్రస్తుతం వాటిని సామాన్యులకు అందనంత ఎత్తుకు తీసుకెళ్లిందని తీవ్రంగా మండిపడ్డారు. మార్చి 7న సిలిండర్‌పై 60 రూపాయలు పెంచిన ప్రభుత్వం, మూడు నెలలు తిరక్కుండానే మళ్లీ 29 రూపాయలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజల పై అదనపు భారాన్ని మోపిందని ఆయన విమర్శించారు. ఎన్నికలకు ముందు దేశంలో ఇంధన వనరులకు కొదవలేదని ధరలు పెరగవని మోడీ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, ఎన్నికలు ముగియగానే అసలు రంగు బయటపెట్టారని ఆయన ఆరోపించారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే నిలిపివేసి పెంచిన ధరలను తగ్గించాలని, లేనిపక్షంలో ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పడాల శంకర్, జి.సీతారాం, ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి, ఎస్.లక్ష్మి, గంగామణి, నాగమణి, కృష్ణ, దేవయ్య, లాలయ్య, బి.సాయిలు, డి.పోశెట్టి, శంకర్, హనుమాన్లు, లక్ష్మణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలి : సర్పంచ్ అంజవ్వ లక్ష్మణ్

**నిజామాబాద్ జిల్లా (వర్ని), జూన్ 08(డీడీ9 వార్త) :**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంపొందించడమే లక్ష్యంగా వర్ని మండలం మల్లారం గ్రామంలో 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ అంజవ్వ లక్ష్మణ్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల వసతులను కల్పిస్తోందని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బడి వయసు పిల్లలందరూ విద్యావంతులు కావాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని, దీని కోసం ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేతావత్ రమేష్, బీమా, పవన్, నవీన్, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# బోధన్ పట్టణ ప్రగతిలో భాగస్వాములు కావాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 08(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 21వ వార్డు నుండి 30వ వార్డులకు సంబంధించిన సంయుక్త వార్డు సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోధన్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గణేష్, మండల ఆర్ఐ శ్రీనివాస్ మరియు మెప్మా పట్టణ సమన్వయకర్త శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పట్టణాన్ని సుందరంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించిన ఈ సభలో మెప్మా సమన్వయకర్త శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఇళ్ల నుండి వెలువడే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకే అందించాలని డ్రైనేజీలలో చెత్త వేయకూడదని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, దోమల నివారణకు మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం ఆర్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటర్ల జాబితాతో అనుసంధానం చేసుకోవాలని, ఈ ప్రక్రియను వంద శాతం విజయవంతం చేసేందుకు కౌన్సిలర్లు, బీఎల్వోలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ వెంకటనారాయణ సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ, గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్ నమ్మి ఓటీపీలు చెప్పవద్దని, డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలకు పాల్పడే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు నిరంతరం కనిపెట్టుకుని ఉండాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్లు, అధికారులు, మెప్మా సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.









# పోలీసు దర్యాప్తులో సాంకేతిక విప్లవం

- **సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య అమలుపై రాష్ట్ర డీజీపీ దిశానిర్దేశం**

**నిజామాబాద్ జిల్లా, జూన్ 08(డీడీ9 వార్త) :**

రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించే లక్ష్యంతో, సీసీటీఎన్ఎస్ 2.0 మరియు ఈసాక్ష్య వ్యవస్థల అమలుపై రాష్ట్ర డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ కమిషనరేట్లు, జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ... సీసీటీఎన్ఎస్ 2.0ద్వారా నేరాలు, నేరస్థుల సమాచారాన్ని వేగవంతంగా నమోదు చేయడం, దర్యాప్తు ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన సేవలను అందించవచ్చని స్పష్టం చేశారు. నేర సంఘటనలకు సంబంధించిన డిజిటల్ ఆధారాలను సేకరించడం, వాటిని భద్రపరచడం మరియు కోర్టు విచారణల సమయంలో సమర్పించే ప్రక్రియలో 'ఈసాక్ష్య' వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ వ్యవస్థల వినియోగంపై క్షేత్రస్థాయి అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని, దర్యాప్తు నాణ్యతను పెంచే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని డీజీపీ దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నిజామాబాద్ జిల్లా నుండి అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్ పాల్గొన్నారు. వీరితో పాటు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్, సి.టి.సి ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీ శ్రీనివాస్, మస్తాన్ అలీ, రాజశేఖర్; స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేష్, సి.సి.ఆర్.బి ఇన్‌స్పెక్టర్ అంజయ్య, పి.సి.ఆర్ ఇన్‌స్పెక్టర్ వీరయ్యతో పాటు పలువురు సి.ఐలు, ఎస్.ఐలు, ఐ.టి కోర్ సిబ్బంది, స్టేషన్ రైటర్స్ మరియు టెక్నీషియన్లు పాల్గొన్నారు.

# జిల్లాలో డయేరియా, పోలియో, నులిపురుగుల నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ

**నిజామాబాద్ జిల్లా, జూన్ 08(డీడీ9 వార్త) :**



నిజామాబాద్ జిల్లాలో ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన డయేరియా నియంత్రణ, పల్స్ పోలియో మరియు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాలపై సోమవారం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ భుజంగరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి.రాజశ్రీ పాల్గొని మూడు కీలక ఆరోగ్య కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో డయేరియా మరణాలను పూర్తిగా అరికట్టేందుకు జూన్ 16 నుండి జూలై 31 వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 1 నుండి 15 వరకు సన్నాహక ఏర్పాట్లు పూర్తి చేసి, ఆపై ప్రధాన కార్యక్రమాన్ని చేపట్టాలని, ప్రతి ఇంట్లో ఐదేళ్లలోపు పిల్లల సంఖ్యకు అనుగుణంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు జింక్ మాత్రలను అందుబాటులో ఉంచాలని సూచించారు. తల్లులకు అవసరమైన కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు, మురికివాడలు మరియు గిరిజన ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, సురక్షిత తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా జూన్ 28న బూత్ స్థాయిలో పోలియో చుక్కల మందు పంపిణీ చేసి, జూన్ 29, 30 తేదీలలో వైద్య సిబ్బంది, వాలంటీర్ల ద్వారా ఇంటింటికి తిరిగి పిల్లలకు చుక్కలు వేయనున్నట్లు వెల్లడించారు. 2014 నుండి దేశంలో పోలియో రహిత స్థితిని కొనసాగిస్తున్న నేపథ్యంలో, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరాను, రవాణా శాఖ వాహనాలను సమకూర్చుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ట్రాన్సిట్ బూతులను ఏర్పాటు చేసి ప్రయాణంలో ఉన్న పిల్లలను కూడా గుర్తించి చుక్కలు వేయాలని స్పష్టం చేశారు. ఇక ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలను అందజేయడం ద్వారా రక్తహీనతను అరికట్టేందుకు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో నోడల్ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులకు మాత్రలు వేయాలని, గ్రామీణ స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ఈ ఆరోగ్య కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నులిపురుగుల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించగా, వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజా భద్రతలో ప్రజల భాగస్వామ్యం కీలకం

- **ఏసీపీ శ్రీనివాస్**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 08(డీడీ9 వార్త) :**



సాలూర మండల కేంద్రంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సోమవారం ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ గురించి వివరిస్తూ, గ్రామాల్లో నేరాలను అరికట్టేందుకు సిసి కెమెరాల ఏర్పాటు అత్యంత ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా అసాంఘిక కార్యకలాపాలను అరికట్టవచ్చని, ఇది ప్రజలకు భద్రతా భరోసానిస్తుందని తెలిపారు. ముఖ్యంగా యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లల ప్రవర్తనపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దని, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏసీపీ హెచ్చరించారు. ఆయా శాఖల అధికారులు ప్రగతిను వివరించారు. ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రతే గ్రామాభివృద్ధికి మూలం

- **డీపీఓ శ్రీనివాసరావు**

**నిజామాబాద్ జిల్లా, జూన్ 08(డీడీ9 వార్త) :**

తెలంగాణ ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భీమ్‌గల్ మండలంలోని ఏడు గ్రామాల్లో సోమవారం ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. పల్లికొండ, సికింద్రాపూర్, ముచుకూరు, దేవనపల్లి, రూపులతండ, తాళ్లపల్లి గ్రామాల్లో జరిగిన ఈ సభలలో భాగంగా, పల్లికొండలో నిర్వహించిన కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాసరావు, ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ... వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లోని పిచ్చి మొక్కలను తొలగించడం, మురుగు కాలువలను శుభ్రపరచడం, బ్లీచింగ్ పౌడర్ మరియు యాంటీ లార్వా స్ప్రే చేయించడం వంటి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ ట్రాక్టర్లకే అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. రహదారులపై గానీ, డ్రైనేజీల్లో గానీ చెత్తను వేయకూడదని ఆయన స్పష్టం చేశారు. సురక్షిత తాగునీటి సరఫరాను నిర్ధారించాలని గ్రామపంచాయతీ అధికారులను ఆదేశించిన డీపీఓ, జల సంరక్షణలో భాగంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని, గ్రామంలో సామూహిక ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యావరణ సమతుల్యత కోసం రాబోయే వర్షాకాలంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, ఇందుకోసం అనువైన స్థలాలను గుర్తించి ప్రతి ఇంట్లో ఐదు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా, అర్హులైన వారందరూ జీపీఓ, బీఎల్వోల ద్వారా ఎన్యూమరేషన్ ఫారమ్స్ నింపి ఓట్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు




# రైతులకు డ్రమ్ సీడర్ల పంపిణీ

**నిజామాబాద్ జిల్లా, జూన్ 08(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బషీరాబాద్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ హాజరై, తమ చేతుల మీదుగా స్థానిక రైతులకు 40 డ్రమ్ సీడర్లను అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ కమ్మర్‌పల్లి జోనల్ ఇంచార్జ్ సాయిరెడ్డి మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను మరియు పనిముట్లను ప్రోత్సహించడం ద్వారా రైతులకు శ్రమ తగ్గడమే కాకుండా, సాగులో లాభదాయకత పెరుగుతుందని పేర్కొన్నారు. డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ గ్రామీణ రైతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఇద్దండి నారాయణ, చిలివేరి రాములు, గుండబోయిన రాజు, గంగాధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు : అదనపు డీసీపీ ఎన్.శుభం ప్రకాష్

**నిజామాబాద్ జిల్లా, జూన్ 08(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ ఇన్చార్జ్ పోలీస్ కమిషనర్, కామారెడ్డి జిల్లా ఎస్పీ శ్రీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు డీసీపీ (అడ్మిన్) శ్రీ ఎన్. శుభం ప్రకాష్ హాజరై జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి మొత్తం 13 అర్జీలను స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఓపికగా ఆలకించిన అదనపు డీసీపీ, వాటిని చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అక్కడికక్కడే సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్.ఐ, సి.ఐలతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల తీవ్రతను తెలుసుకోవడంతో పాటు, వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ... ప్రజలు ఎటువంటి పైరవీలు లేకుండా, నేరుగా తమ సమస్యలను పోలీసులకు వివరించాలని కోరారు. పోలీసులు ప్రజలకు మరింత చేరువయ్యేలా శాంతిభద్రతలను పటిష్టం చేయడమే తమ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి ద్వారా తమ సమస్యలకు చట్టపరమైన పరిష్కారం పొందే అవకాశం ఉందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతకు బాటలు

**నిజామాబాద్ జిల్లా, జూన్ 08(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో మహిళా సంఘాల కార్యకలాపాల కోసం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న నూతన భవనానికి సోమవారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు మరియు గ్రామ పెద్దలతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ శైలేందర్ మాట్లాడుతూ... మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా ఈ భవన నిర్మాణం ఎంతో కీలకమని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధికి ఈ భవనం ఒక వేదికగా మారుతుందని, భవిష్యత్తులో సంఘాల సమావేశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు మరియు వివిధ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు ఇది కేంద్రంగా ఉంటుందని వివరించారు. గ్రామాభివృద్ధిలో మహిళా సంఘాల పాత్ర ఎంతో కీలకమని, వారి కార్యకలాపాలకు ఒక శాశ్వత వేదిక అందుబాటులోకి రావడం సంతోషదాయకమని ఆయన అన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేసి మహిళా సంఘాలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కిరణ్ కుమార్, పీఆర్ ఏఈ రాజన్న, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు డాక్టర్ నరేష్, సాదుల్ల, ఐకేపీ సీసీ నవీన్, వీఓఏలు అనూష, రామదేవి, ఉమ, ప్రేమల, ఓబీలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వైభవ్ సూర్యవంశీది స్పెషల్ టాలెంట్.. కానీ..!: కపిల్ దేవ్

- వైభవ్‌పై కపిల్ ప్రశంసల జల్లు
- అతడిపై ఒత్తిడి తేవొద్దని సూచన
- కేవలం ఆటపైనే ఫోకస్ చేయాలని వైభవ్‌కు సూచన
- ఐపీఎల్ వల్ల సెలెక్టర్లకు మంచి ఆప్షన్లు దొరుకుతున్నాయని విశ్లేషణ

**డిడి9 వార్త:**

భారత క్రికెట్ జట్టు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ప్రశంసలు కురిపించాడు. అతడు చాలా అద్భుతమైన ప్రతిభావంతుడని కొనియాడాడు. అయితే ఇంత చిన్న వయసులోనే అతనిపై విపరీతమైన ఒత్తిడిని తీసుకురావద్దని సూచించాడు.

వైభవ్ ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని, చిన్న వయసులోనే క్లబ్ క్రికెట్‌లో అతను ఆడిన తీరు అతని అసాధారణ సామర్థ్యాన్ని నిరూపించిందని కపిల్ దేవ్ అన్నాడు. ప్రస్తుతం అతను ఎక్స్‌ట్రా విషయాల జోలికి వెళ్లకుండా కేవలం తన ఆటపై మాత్రమే దృష్టి పెట్టాలని సూచించాడు. ఈ సమయంలో అతనిపై మనమందరం మోయలేనంత ఒత్తిడి పెంచుతున్నామని ఆందోళన వ్యక్తం చేశాడు.

సెలెక్షన్ ప్రక్రియపై ఐపీఎల్ ప్రభావం గురించి 1983 ప్రపంచకప్ విజేత కపిల్ దేవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచంలోనే ఐపీఎల్ అత్యంత కీలకమైన టోర్నమెంట్ అని పేర్కొన్నాడు. ఐపీఎల్‌లో ఆటగాళ్ల ప్రదర్శనను సెలెక్టర్లు నిరంతరం గమనిస్తున్నారని, సరైన స్థానంలో సరిపోయే ఆటగాళ్లను ఎంపిక చేయడానికి సెలెక్టర్లకు ఇప్పుడు మంచి ఆప్షన్లు దొరుకుతున్నాయని చెప్పాడు.

ఇక వైభవ్ సూర్యవంశీ విషయానికి వస్తే.. కేవలం 15 ఏళ్ల 71 రోజుల వయసులోనే ఈ ఎడమచేతి వాటం ఓపెనర్ భారత టీ20 జట్టుకు ఎంపికయ్యాడు. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలతో పాటు ఆసియా క్రీడలు 2026 కోసం సెలెక్టర్లు అతనికి చోటు కల్పించారు. దీంతో భారత జట్టుకు ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచి సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 36 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు.





## ముంబై ఇండియన్స్‌కు సూర్య గుడ్ బై?.. సోషల్ మీడియాలో కలకలం!

- టీ20 కెప్టెన్సీ కోల్పోయి, జట్టులో చోటు కోల్పోయిన సూర్యకుమార్
- ముంబై ఇండియన్స్‌ను వీడనున్నట్టు ఊహాగానాలు
- ఇన్‌స్టాగ్రామ్‌లో ముంబైకి సంబంధించిన పోస్టులు, ఫొటోల తొలగింపు
- సూర్యకు అండగా నిలిచిన భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్
- కెప్టెన్‌గా వరల్డ్ కప్ గెలిపించాడన్న విషయం మరువొద్దన్న అశ్విన్

**డిడి9 వార్త:**

టీమిండియా స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ కెరీర్ ప్రస్తుతం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. ఇటీవలే టీ20 జట్టు కెప్టెన్సీని కోల్పోయి, జట్టులోనూ స్థానం కోల్పోయిన ఆయనకు ఇప్పుడు మరో కొత్త సవాలు ఎదురైంది. తాను ఎంతో కాలంగా ప్రాతినిధ్యం వహిస్తున్న ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీకి కూడా ఆయన గుడ్ బై చెప్పనున్నారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. తాజాగా సూర్యకుమార్ తన ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ నుంచి ముంబై ఇండియన్స్‌కు సంబంధించిన అన్ని పోస్టులను, ఫొటోలను తొలగించడం ఈ వాదనలకు బలం చేకూర్చింది.

2018లో కోల్‌కతా నైట్ రైడర్స్ నుంచి ముంబై ఇండియన్స్‌కు వచ్చిన సూర్యకుమార్, జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అయితే, 2026 ఐపీఎల్ సీజన్‌లో ఆయన దారుణంగా విఫలమయ్యాడు. ఈ సీజన్‌లో 10 మ్యాచ్‌లలో కేవలం 20.77 సగటుతో 270 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో ముంబై యాజమాన్యం ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది. సూర్యకుమార్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ముంబై ఇండియన్స్, హార్దిక్ పాండ్యా ఖాతాలను అనుసరించడం లేదని కూడా ఫ్యాన్స్ గుర్తించారు. ప్రస్తుతం రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీతో ఉన్న ఒక ఫొటో మాత్రమే సూర్య ఖాతాలో ఉంది.

**సూర్యకుమార్‌కు అన్యాయం జరిగింది: అశ్విన్**

ఈ పరిణామాలపై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందించాడు. సూర్యకుమార్‌ను జట్టు నుంచి తప్పించడంపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. "సూర్యకుమార్ స్థానంలో ఉండి ఆలోచిస్తే, అతని బాధను అర్థం చేసుకోవచ్చు. జట్టు నుంచి తొలగించినందుకు బాధపడే హక్కు ప్రతి ఆటగాడికీ ఉంటుంది" అని అశ్విన్ పేర్కొన్నాడు.

"గత 1518 నెలలుగా సూర్య ఫామ్‌లో లేడన్న మాట వాస్తవమే కావచ్చు. కానీ, ఒక కెప్టెన్‌గా అతను దేశానికి టీ20 ప్రపంచకప్ అందించాడన్న విషయాన్ని సెలక్టర్లు విస్మరించారు. వరల్డ్ కప్‌లో బ్యాటర్‌గా గొప్పగా రాణించకపోయినా, కెప్టెన్‌గా జట్టును విజయపథంలో నడిపించాడు. జట్టులోని ఉత్తమ బ్యాటర్, బౌలర్ మాదిరిగానే, అతను కూడా ఉత్తమ కెప్టెన్‌గా తన పాత్ర పోషించాడు కదా?" అని అశ్విన్ ప్రశ్నించాడు. మొత్తం మీద టీమిండియాలో చోటు కోల్పోవడం, ఇప్పుడు ఫ్రాంచైజీ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకోవడంతో సూర్యకుమార్ కెరీర్ ఒకరకమైన సందిగ్ధ దశలో పడింది.



# ఫిఫా వరల్డ్ కప్‌లో వింత పరిస్థితి: అమెరికాకు వెళ్లకుండా మెక్సికోలో దిగిన ఇరాన్ జట్టు

- 2026 ఫిఫా వరల్డ్ కప్ కోసం ఇరాన్ జట్టు అమెరికాకు బదులు మెక్సికోకు చేరిక
- వీసాల జారీలో అమెరికా కావాలనే జాప్యం చేసిందని ఇరాన్ ఆరోపణ
- భద్రతా కారణాల వల్లే కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పిన అమెరికా
- మ్యాచ్ లకు ముందు మాత్రమే ఇరాన్ జట్టుకు అమెరికాలోకి ప్రవేశం
- ఈ విషయంపై ఫిఫాకు ఫిర్యాదు చేసేందుకు ఇరాన్ ఫుట్‌బాల్ సమాఖ్య నిర్ణయం



**డిడి9 వార్త:**

2026 ఫిఫా వరల్డ్ కప్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఇరాన్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు, ఆతిథ్య దేశమైన అమెరికాలో అడుగుపెట్టకుండా సరిహద్దులోని మెక్సికో నగరమైన టిజువానాకు చేరుకుంది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ వాతావరణం, వీసా నిబంధనల కారణంగా ఈ విచిత్ర పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామం క్రీడా ప్రపంచంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

అమెరికా తమ పట్ల వివక్ష చూపుతోందని, ఉద్దేశపూర్వకంగానే అడ్డంకులు సృష్టిస్తోందని ఇరాన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు మెహదీ తాజ్ తీవ్ర ఆరోపణలు చేశారు. జూన్ 15న లాస్ ఏంజిల్స్‌లో న్యూజిలాండ్‌తో జరగనున్న మొదటి మ్యాచ్‌కు కేవలం ఒక్కరోజు ముందు మాత్రమే తమ ఆటగాళ్లకు వీసాలు జారీ చేశారని ఆయన తెలిపారు. సహాయక సిబ్బంది, మీడియా ప్రతినిధులు చాలా మందికి ఇంకా వీసాలు రాలేదని, దీనిపై ఫిఫాకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

ఈ ఆరోపణలపై ఒక అమెరికా అధికారి స్పందించారు. ఇరాన్ ఆటగాళ్లు, అవసరమైన సిబ్బందికి వీసాలు మంజూరు చేశామని ధృవీకరించారు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా కఠినంగా వ్యవహరించాల్సి వస్తోందని తెలిపారు. "ఈ టోర్నమెంట్‌ను అడ్డం పెట్టుకుని ఇరాన్ తమ ఉగ్రవాదులను అమెరికాలోకి పంపే ప్రయత్నాలను అనుమతించం" అని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుత ప్రణాళిక ప్రకారం, ఇరాన్ జట్టు మెక్సికోలోనే ఉంటూ మ్యాచ్‌లు ఉన్నప్పుడు మాత్రమే మల్టిపుల్‌ఎంట్రీ వీసాలతో అమెరికాకు వచ్చి వెళుతుంది. జూన్ 15న న్యూజిలాండ్‌తో, జూన్ 21న బెల్జియంతో లాస్ ఏంజిల్స్‌లో, జూన్ 26న ఈజిప్టుతో సియాటిల్‌లో ఇరాన్ తలపడనుంది. ఒక ఆతిథ్య దేశం, టోర్నీలో పాల్గొంటున్న మరో దేశంతో యుద్ధంలో ఉండటం వరల్డ్ కప్ చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, ఫిఫా వరల్డ్ కప్2026కి అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే.

# డయాబెటిస్‌తో పోరాడుతూ... ఫ్రెంచ్ ఓపెన్ గెలిచి... జ్వెరెవ్ కథే వేరు!

- ఫ్రెంచ్ ఓపెన్ 2026 విజేతగా నిలిచిన అలెగ్జాండర్ జ్వెరెవ్
- ఫైనల్‌లో కొబోలీపై అయిదు సెట్ల హోరాహోరీ పోరులో గెలుపు
- జ్వెరెవ్‌కు ఇదే తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్
- టైప్ 1 డయాబెటిస్‌తో బాధపడుతూనే ఈ ఘనత సాధించిన జర్మన్ ప్లేయర్
- 4 ఏళ్ల వయసులోనే మధుమేహం బారినపడిన జ్వెరెవ్
- కోర్టులోనే ఇన్సులిన్ తీసుకుంటూ పోరాటం
- 1996 తర్వాత గ్రాండ్‌స్లామ్ గెలిచిన తొలి జర్మన్ పురుష ఆటగాడిగా రికార్డు

**డిడి9 వార్త:**

పట్టుదల ముందు వైకల్యం తలవంచింది. అకుంఠిత దీక్ష ముందు అడ్డంకులు చిన్నబోయాయి. ఏళ్ల తరబడి ఊరిస్తున్న కల, కెరీర్‌ను వెంటాడుతున్న 'విజయం అంచున బోల్తా కొట్టే ఆటగాడు' అనే ముద్ర.. అన్నింటికీ ఒకే ఒక్క విజయంతో సమాధానమిచ్చాడు జర్మనీ టెన్నిస్ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్. రోలాండ్ గారోస్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ 2026 ఫైనల్‌లో చారిత్రాత్మక విజయం సాధించి, తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ముద్దాడాడు. కేవలం క్రీడా విజయంగానే కాకుండా, టైప్ 1 డయాబెటిస్‌తో పోరాడుతున్న లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చే విజయమిది. ఆదివారం కోర్ట్ ఫిలిప్ చాట్రియర్‌లో జరిగిన హోరాహోరీ ఫైనల్ మ్యాచ్‌లో ఇటలీ ఆటగాడు ఫ్లావియో కొబోలిపై జ్వెరెవ్ గెలుపొందాడు.

దాదాపు నాలుగు గంటల పాటు సాగిన ఈ అయిదు సెట్ల థ్రిల్లర్‌లో వరల్డ్ నంబర్ 3, రెండో సీడ్ అయిన జ్వెరెవ్ 61, 46, 64, 67(5), 61 తేడాతో విజయం సాధించాడు. ఈ గెలుపుతో, 1996లో బోరిస్ బెకర్ తర్వాత మేజర్ టైటిల్ గెలిచిన తొలి జర్మన్ పురుష ఆటగాడిగా జ్వెరెవ్ రికార్డు సృష్టించాడు. గతంలో యూఎస్ ఓపెన్ ఫైనల్, ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌తో పాటు పలు సెమీ ఫైనల్స్‌లో ఓటమి పాలైన జ్వెరెవ్‌కు ఈ విజయం అపారమైన మానసిక బలాన్నిచ్చింది.

ఈ విజయం వెనుక జ్వెరెవ్ చేసిన పోరాటం అంతా ఇంతా కాదు. కేవలం నాలుగేళ్ల వయసులోనే అతనికి టైప్ 1 డయాబెటిస్ ఉన్నట్టు నిర్ధారణ అయింది. అప్పటి నుంచి అతని జీవితం ఒక సవాల్‌గా మారింది. ఒకవైపు ప్రొఫెషనల్ టెన్నిస్‌లో అత్యున్నత ప్రమాణాలు అందుకుంటూనే, మరోవైపు తన రక్తంలో చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు నియంత్రించుకోవాల్సి వచ్చేది. "ఒకేసారి రెండు ఆటలు ఆడుతున్నట్టు ఉంటుంది" అని తన పరిస్థితిని జ్వెరెవ్ తరచూ చెప్పేవాడు. ఈ ఫైనల్ మ్యాచ్ మధ్యలో కూడా, అతను కోర్టులోనే ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకోవడం అతని పోరాట పటిమకు, సంకల్పానికి నిలువుటద్దం. గతంలో టెన్నిస్ నిబంధనల ప్రకారం ఇది సాధ్యం కాకపోయినా, తనలాంటి వారి కోసం పోరాడి ఈ మార్పును తీసుకురావడంలో జ్వెరెవ్ కీలక పాత్ర పోషించాడు.

ఒలింపిక్ స్వర్ణ పతకం, ఏటీపీ ఫైనల్స్ టైటిల్స్ గెలిచినప్పటికీ, గ్రాండ్‌స్లామ్ లేని లోటు అతడిని వెంటాడింది. పదో సీడ్ కొబోలీతో జరిగిన ఫైనల్ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. తొలి సెట్‌ను సులభంగా గెలిచిన జ్వెరెవ్, ఆ తర్వాత కొబోలీ నుంచి తీవ్రమైన ప్రతిఘటన ఎదుర్కొన్నాడు. నాలుగో సెట్ టైబ్రేక్‌లో ఓడిపోయినప్పటికీ, మానసికంగా కుంగిపోకుండా నిర్ణయాత్మక ఐదో సెట్‌లో అద్భుతంగా పుంజుకుని 61తో సెట్‌ను, మ్యాచ్‌ను, టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీలో అల్కరాజ్, సిన్నర్, జకోవిచ్ వంటి టాప్ ప్లేయర్లు లేకపోవడం అతనికి కలిసివచ్చిందని కొందరు విమర్శించినా, అతను ప్రదర్శించిన పోరాట పటిమ ముందు ఆ విమర్శలు నిలబడలేవు.

జ్వెరెవ్ కేవలం ఆటగాడిగానే కాకుండా ఒక మానవతావాదిగానూ అందరి మన్ననలు పొందుతున్నాడు. 2022లో 'అలెగ్జాండర్ జ్వెరెవ్ ఫౌండేషన్' స్థాపించి, తనలాగే టైప్ 1 డయాబెటిస్‌తో బాధపడుతున్న పిల్లలకు అండగా నిలుస్తున్నాడు. ఇన్సులిన్, ఇతర మందులు అందిస్తూ ఇప్పటివరకు 1,150 మందికి పైగా చిన్నారులకు సహాయం అందించాడు. టైప్ 1 డయాబెటిస్‌తో పోటీపడుతూ గ్రాండ్‌స్లామ్ గెలిచిన తొలి ఆటగాడిగా జ్వెరెవ్ చరిత్ర పుటల్లో నిలిచిపోతాడు. ఈ విజయం అతని కెరీర్‌ను సుస్థిరపరచడమే కాకుండా, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో పోరాడుతున్న వారికి ఒక ఆశాకిరణంగా నిలుస్తుంది.

ఈ టోర్నీలో అల్కరాజ్, సిన్నర్, జకోవిచ్ వంటి టాప్ ప్లేయర్లు లేకపోవడం జ్వెరెవ్‌కు కలిసివచ్చిందని కొందరు విమర్శించినా, ఫైనల్‌లో అతను చూపిన పోరాట పటిమ, వ్యక్తిగత సంకల్పం ముందు ఆ విమర్శలు నిలబడలేవు. పాకిస్థాన్ క్రికెట్ దిగ్గజం వసీం అక్రమ్, స్పానిష్ ఫుట్‌బాలర్ నాచో ఫెర్నాండెజ్ వంటి క్రీడాకారులు కూడా డయాబెటిస్‌ను జయించి క్రీడల్లో రాణించారు. ఇప్పుడు వారి సరసన జ్వెరెవ్ కూడా నిలిచాడు.



## టెస్టు క్రికెట్ చరిత్రలో టీమిండియాకు అతి పెద్ద విజయం.. ఆఫ్ఘన్‌పై రికార్డు గెలుపు

- ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 300 పరుగులతో భారత్ చారిత్రక విజయం
- టెస్టు క్రికెట్‌లో టీమిండియాకు ఇదే అతిపెద్ద గెలుపు
- తొలి ఇన్నింగ్స్‌లో మానవ్ సుతార్, రెండో ఇన్నింగ్స్‌లో వాషింగ్టన్ సుందర్ మాయ
- గిల్, కేఎల్ రాహుల్ సెంచరీలతో భారీ స్కోరు సాధించిన భారత్
- కేవలం 112 పరుగులకే కుప్పకూలిన ఆఫ్ఘన్ రెండో ఇన్నింగ్స్

**డిడి9 వార్త:**

ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌పై భారత్ చారిత్రక విజయం సాధించింది. ఇన్నింగ్స్, 300 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. టెస్టు క్రికెట్ చరిత్రలో టీమిండియాకు పరుగుల పరంగా ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. భారత బౌలర్ల ధాటికి ఆఫ్ఘనిస్థాన్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ చేతులెత్తేసింది.

చండీగఢ్‌లోని ముల్లన్‌పూర్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (126), కేఎల్ రాహుల్ (100) సెంచరీలతో 8 వికెట్లకు 564 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ కేవలం 152 పరుగులకే ఆలౌట్ అయింది. భారత యువ స్పిన్నర్ మానవ్ సుతార్ 6 వికెట్లతో సత్తా చాటడంతో ఆఫ్ఘన్ ఫాలోఆన్ ఆడాల్సి వచ్చింది.

ఫాలోఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆఫ్ఘనిస్థాన్, కేవలం 35.5 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది. భారత స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్ (4 వికెట్లు), కుల్దీప్ యాదవ్ (3 వికెట్లు) ఆఫ్ఘన్ పతనాన్ని శాసించారు. వారికి పేసర్ మహమ్మద్ సిరాజ్ ఒక వికెట్‌తో సహకరించాడు.



రెండో ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘన్ ఓపెనర్లు తొలి వికెట్‌కు 42 పరుగులు జోడించి కాస్త ప్రతిఘటించినా, సిరాజ్ వికెట్ తీయడంతో వారి పతనం ప్రారంభమైంది. లంచ్ తర్వాత కేవలం 24 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పూర్తిగా ఓటమిని ఖాయం చేసుకుంది. గాయం కారణంగా ఆఫ్ఘన్ ఆటగాడు షరఫుద్దీన్ అష్రఫ్ బ్యాటింగ్‌కు రాలేదు.

# జాన్వీ కపూర్ చెప్పినా డైరెక్టర్ వినలేదు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ జంటగా నటించిన లేటెస్ట్ మూవీ పెద్ది. మూడు రోజుల కిందట రిలీజ్ అయిన ఈ సినిమా, బాక్సాఫీస్ ను దున్నేస్తోంది. అయితే పెద్ది సినిమాలో బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ స్కిన్ షో పై విమర్శలు తీవ్ర స్థాయిలో వస్తున్నాయి. సినిమా షూటింగ్ సమయంలోనే ఈ స్కిన్ షోపై జాన్వీ అభ్యంతరం చెప్పినట్లు స్క్రీన్ షాట్లు కూడా వైరల్ అయ్యాయి.


అయితే ఈ వివాదంపైన తాజాగా జాన్వీ కపూర్ మేకప్ ఆర్టిస్ట్ సాఫ్లీన్ కౌర్ సోషల్ మీడియా వేదికగా సంచలన పోస్ట్ చేసి.. మరో వివాదానికి తెర లేపారు. జాన్వీ కపూర్ ప్రొఫెషనల్ బౌండరీ గీశారని.. బోల్డ్ సీన్లు వద్దని ముందే చెప్పినట్లు వెల్లడించారు. కానీ సినిమా డైరెక్టర్ మాత్రం గీత దాటి... తనకు నచ్చినట్లు చేశారని ఆరోపణలు చేశారు. బాక్సాఫీస్ నెంబర్స్ కోసం ఫైనల్ ఎడిట్ లో.. స్కిన్ షో అలాగే ఉంచారని ఆరోపించారు. దీంతో జాన్వీ మేకప్ ఆర్టిస్ట్ సాఫ్లీన్ కౌర్ చేసిన పోస్టు దుమారం లేపుతోంది.



## దురదృష్టవశాత్తు కొన్ని చాన్సులు మిస్ అయ్యాయి..

కోలీవుడ్ యంగ్ బ్యూటీ తేజు అశ్విని యూట్యూబర్‌గా కెరీర్ మొదలుపెట్టి నటనపై ఆసక్తితో నటిగా ఇండస్ట్రీకి హీరోయిన్‌గా వచ్చారు. 'ఎన్నా సొల్ల పోగిరై' మూవీతో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత పలు సినిమాలు చేసి ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. ఇటీవల 'నవాబ్ కేఫ్' అనే సినిమాతో ఈ అమ్మడు టాలీవుడ్‌లోకి కూడా ఎంట్రీ ఇచ్చారు. యంగ్ హీరో శివ కందుకూరి సరసన ఆమె నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం తేజు అశ్విని తమిళంలో 'మూండ్రమ్ కన్' అనే క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ సినిమాలో నటిస్తూ బిజీగా ఉన్నారు. దీనితో పాటు మరికొన్ని క్రేజీ ప్రాజెక్టులకు కూడా సైన్ చేశారు. సినిమాల్లో రాణిస్తూ బిజీగా ఉన్నప్పటికీ.. తాను కొన్ని పెద్ద చిత్రాలలో నటించే అద్భుతమైన అవకాశాలను కోల్పోయానని తేజు అశ్విని తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సూపర్ హిట్ అయిన చిత్రాల్లో తనకు ఆఫర్లు వచ్చినప్పటికీ, కొన్ని కారణాల వల్ల వాటిని చేయలేకపోయానని మనసు విప్పి మాట్లాడారు.

"నేను కోలీవుడ్ హిట్ హర్రర్ ఫ్రాంచైజీ 'డిమోంటే కాలనీ 2' సినిమాలో భాగం కావాల్సింది. ఆ చిత్రంలో నటించే అవకాశం నా దాకా వచ్చింది, కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ కుదరలేదు. అలాగే యువతను ఎంతగానో ఆకట్టుకున్న 'లవర్' చిత్రం కోసం కూడా మేకర్స్ నన్ను పరిశీలించారు. ఆ సినిమాలో హీరోయిన్ పాత్రకు నేను ఎంపికయ్యేలా కనిపించినా, దురదృష్టవశాత్తు కొన్ని కారణాల వల్ల అందులోనూ నటించలేకపోయాను" అని చెప్పారు. అలాగే ఇండస్ట్రీలో అవకాశాల గురించి మాట్లాడుతూ.. "కొన్నిసార్లు ఒక నటి ప్రయాణంలో మనకు దక్కని పాత్రలే మనల్ని ఎక్కువగా ఆలోచింపజేస్తుంటాయి. 'ఒకవేళ ఆ పాత్ర నేను చేసి ఉంటే నా కెరీర్ ఎలా ఉండేదో' అనే ఆలోచనలను మిగిల్చే అతిపెద్ద అంశాలుగా ఇవి మారుతుంటాయి. కానీ వాటన్నింటినీ దాటుకుని ముందుకు వెళ్లడమే ఒక నటిగా అసలైన ప్రయాణం" అని తేజు అశ్విని చెప్పుకొచ్చారు. కెరీర్ ఆరంభంలోనే ఇలాంటి మంచి హిట్ సినిమాలను కోల్పోవడం బాధాకరమే అయినప్పటికీ, భవిష్యత్తులో మరిన్ని మంచి పాత్రలతో అలరిస్తానని



## 'మా బతుకులతో ఆడుకుంటే వదలం'..

టాలీవుడ్ హీరోలకు మాస్ ఇమేజ్‌ను గిఫ్ట్‌గా ఇచ్చిన డైరెక్టర్ పూరీ జగన్నాథ్. గత కొంత కాలంగా ఆయనకు సరైన హిట్ లేదనే విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆయన తాజాగా తెరకెక్కిస్తున్న చిత్రం 'స్లమ్‌డాగ్ – 33 టెంపుల్ రోడ్' (SlumDog – 33 Temple Road). పూరీ జగన్నాథ్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పూరీ కనెక్ట్స్ – జె.బి మోషన్ పిక్చర్స్ పతాకాలపై పూరీ జగన్నాథ్, ఛార్మీ కౌర్, జె.బి నారాయణరావు కొండ్రొల్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

ఈ చిత్రంలో విజయ్ సేతుపతి, టబు, సంయుక్త, దునియా విజయ్ కుమార్, జరీనా వహాబ్, వి.టి.వి గణేష్, బ్రహ్మాజీ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "ఒక్క వాన పడితే కాకుల్లా చెట్ల కింద దాక్కునే జీవితాలు మావి.. అలాంటి మా బతుకులతో ఆడుకుంటే నిన్ను ఎందుకు వదులుతాం" అంటూ సాగే భావోద్వేగభరితమైన డైలాగ్‌తో టీజర్ స్టార్ట్ అయిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. టీజర్ అంతటా పవర్‌ఫుల్ యాక్షన్ ఎపిసోడ్స్, ఫైట్స్, మాస్ ఎలిమెంట్స్‌తో నిండి ఉంది. ప్రతి పాత్రను చాలా ఇంటెన్సివ్‌గా చూపించారు మేకర్స్. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతాన్ని అందిస్తుండగా, శామ్ కె. నాయుడు సినిమాటోగ్రఫీ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. సంతోష్ నూజిళ్ల ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో త్వరలో ఈ చిత్రం థియేటర్లలో అలరించడానికి రెడీ అవుతుంది. పూరీ జగన్నాథ్ మార్క్ యాక్షన్, బలమైన ఎమోషన్స్‌తో కూడిన ఈ టీజర్ ప్రస్తుతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పూరీ ఫ్యాన్స్‌తో పాటు సినిమా లవర్స్ ఆయన కంబ్యాక్‌ను గట్టిగా కోరుకుంటున్నారు. తాజాగా రిలీజ్ అయిన ఈ స్లమ్‌డాగ్ టీజర్‌తో ఈసారి పూరీ పక్కా హిట్ కొడతాడని ఆయన ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## సుకుమార్ శిష్యుడు అనిపించుకున్న బుచ్చి..


'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా పరిచయమై, తాజాగా రామ్ చరణ్‌తో 'పెద్ది' సినిమాను తెరకెక్కించిన బుచ్చిబాబు సనా టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు అనే విషయం తెలిసిందే. బుచ్చిబాబు తన గురువు సుకుమార్‌ను అనేక విషయాల్లో ఫాలో అవుతున్నారని పలు సందర్భాల్లో స్పష్టమైంది. సుకుమార్ తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న విమర్శల తరహానే, ఇప్పుడు బుచ్చిబాబు కూడా తన రెండవ సినిమాతో విమర్శలను ఎదుర్కొంటున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సుకుమార్ తన మొదటి చిత్రం 'ఆర్య'తో దర్శకుడిగా మంచి విజయాన్ని సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అయితే ఆ తర్వాత రామ్ పోతినేనితో చేసిన 'జగడం' సినిమాలో హీరోయిన్ పాత్రను బోల్డ్‌గా చూపించారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ఆ పాత్రలోని కొన్ని సంభాషణలు, ప్రవర్తన ప్రేక్షకులను అసౌకర్యానికి గురి చేశాయని అప్పట్లో చర్చ జరిగింది. 'ఆర్య'లాంటి విజయవంతమైన చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు ఇలాంటి పాత్రను ఎందుకు రూపొందించారన్న విమర్శలు కూడా వినిపించాయి.



ఇక అదే తరహాలో బుచ్చిబాబు సనా తన రెండవ సినిమా 'పెద్ది'లో జాన్వీ కపూర్ పాత్రను కూడా బోల్డ్‌గా చూపించారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ సినిమాలో ఆమె పాత్రపై సోషల్ మీడియాలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బుచ్చిబాబు సనా స్పందిస్తూ క్షమాపణలు చెప్పడంతో పాటు, జాన్వీ కపూర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలను తొలగిస్తున్నట్లు తెలిపారు.

## సూర్య 48కు దర్శకుడు ఖరారు?

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య తాజాగా 'కరుప్పు' చిత్రంతో సూపర్ సాలిడ్ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం ఆయన దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. ఇదిలా ఉంటే సూర్య తదుపరి చిత్రానికి సంబంధించిన ఓ కీలక వార్త ప్రస్తుతం కోలీవుడ్ మీడియాలో వైరల్ అవుతోంది. సూర్య తన నెక్స్ట్ మూవీని పా రంజిత్ దర్శకత్వంలో చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది.



ఇప్పటికే పా రంజిత్ ఓ కథను సూర్యకు వినిపించగా, అది ఆయనకు బాగా నచ్చినట్లు సమాచారం. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సూర్య కూడా సానుకూలంగా స్పందించినట్లు టాక్ వినిపిస్తోంది. అన్ని అనుకున్నట్లు జరిగితే మరికొన్ని రోజుల్లోనే ఈ కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. 'కరుప్పు' వంటి భారీ సక్సెస్ తర్వాత సూర్య ఏ దర్శకుడితో సినిమా చేయనున్నాడనే ఆసక్తి కోలీవుడ్ వర్గాల్లో కూడా బలంగా నెలకొంది.

## నేను ఎప్పుడో హీరో అయ్యాను.. దేవి ఇప్పుడు అయ్యాడు..

స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ తాజాగా 'ఓజీ టూర్' కాన్సర్ట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. ఈ క్రమంలో తన సహ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ హీరోగా సినిమా చేస్తున్న విషయంపై ప్రశ్నలు ఎదురయ్యాయి. "మీరు ఎప్పుడు హీరోగా సినిమా చేస్తారు?" అని జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు తమన్ ఆసక్తికరంగా స్పందించారు. తాను ఇప్పటికే 'బాయ్స్' సినిమాలో హీరోగా నటించినట్లు గుర్తు చేసిన ఆయన, "నేను ఎప్పుడో హీరోగా చేశాను, దేవి ఇప్పుడు హీరోగా చేస్తున్నాడు. ఆయన మనకెందుకు అలాంటి విషయాలు" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

నటుడిగా పని చేయడం చాలా కష్టమని, ఎండలో షూటింగ్ చేయాల్సి వస్తుందని, అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. సంగీత దర్శకుడిగా ఉండటం ఎంతో అదృష్టమని, ఆ సౌకర్యం దేవుడిచ్చిన వరమని తెలిపారు. దేవి శ్రీ ప్రసాద్ హీరోగా చేస్తున్న సినిమాపై తనకు పూర్తి నమ్మకం ఉందని, అది తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవుతుందని తమన్ అభిప్రాయపడ్డారు. అలాగే నిర్మాత దిల్ రాజు కూడా ఆ కథ గురించి తనతో మాట్లాడారని వెల్లడించారు. అవసరమైతే ఆ సినిమాకు రెండు, మూడు పాటలు ఇవ్వడానికి కూడా సిద్ధమని ఆయన చెప్పారు. అందరూ కలిసి పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని తమన్ పేర్కొన్నారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





## ఆ ప్రముఖ సంస్థ చేతికి వృషకర్మ నాన్‌థియేట్రికల్ హక్కులు

అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ మైథలాజికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' సినిమాలో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయికగా కనిపించనుంది. 'తండేల్' విజయం తర్వాత నాగ చైతన్య నటిస్తున్న సినిమా కావడం, అలాగే 'విరూపాక్ష' వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న ప్రాజెక్ట్ కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ బయటకు వచ్చింది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ మూవీకి సంబంధించిన నాన్‌థియేట్రికల్ డీల్ ఇప్పటికే క్లోజ్ అయినట్లు తెలుస్తోంది. ప్రముఖ జీ సంస్థ ఈ సినిమా నాన్‌థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. స్పర్శ్ శ్రీవాత్సవ్ ఈ చిత్రంలో విలన్ పాత్రలో కనిపించనుండగా, జయరామ్ కీలక పాత్రలో నటించనున్నారు. బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు సుకుమార్ కథను అందించారు. బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్, సుకుమార్ సంయుక్తంగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర మరియు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500091. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.